# అనుబంధం

నవమి నాటి వెన్నెల ప్రకృతి నిండా పరచుకొని అందాన్నీ, ఆనందాన్నీ పంచుతున్నది. గాలిలోని చల్లదనం ఆ వాతావరణంలో ఆహ్లాదాన్ని నింపుతున్నది. కాని -

ఆంజనేయస్వామి అరుగుమీద నిద్రపట్టక అటూ-ఇటూ దొర్లుతున్నాడు అనంత్‌రెడ్డి. అక్కడి చల్లదనం అతని మనసులోని వేడిమిని చల్లార్చడం లేదు. అదే అరుగుమీద ఎండాకాలంలో సైతం, భరింపలేని ఉక్కపోతలో, దోమల నేపథ్య సంగీతంలో హాయిగా నిద్రపోయేవాడు.

సమయం పదకొండు గావస్తాంది. ఎడతెగని ఆలోచనలు అతడ్ని విపరీతమైన మనస్తాపానికి గురిచేస్తున్నాయి. మెదడంతా ముద్దగా మారి కొట్టుకుంటున్నట్టుగా ఉంది. మూడు రోజుల క్రితం దాకా 'వేరుపడటం' తప్ప మరో మార్గంలేదని ఆరాటపడ్డ అతని మనసు, అది సాధించగానే తిరుగుబాటు మొదలుపెట్టింది. తన అన్న నుండి తనను వేరు చేసిన కారణాలను, కారకులను వితర్కించుకోవడం అప్పుడే ప్రారంభమైంది.

మొదట ఊళ్ళోవాళ్ళే ఇలా అన్నతో తనను వేరు చేశారనిపించింది. తర్వాత తన వదినమ్మ అందుకు కారణమనుకున్నాడు, ఆమె మీద అకారణ కక్ష నిండింది. ఆ పై అన్నయ్య అసమర్థతే ఈ పరిస్థితికి అసలు కారణం అనిపించింది. నిన్న - తన అత్తా - మామ నూరిపోయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందనిపించింది. ఈ రోజు ఉదయం నుంచీ.... భార్య అనూరాధే అసలు కారణమని ధ్రువపడింది. అంతే.... ఆ క్షణం నుండీ ఇంట్లో స్థితి నిప్పుల్లో ఉప్పుపోసినట్లే అయ్యింది.

"అంతేలే. ఎంతైనా మీరూ - మీరూ ఒక్కటే. నేనే పరాయి దాన్నయిపోయాను. నాకూ, నా బిడ్డలకు ఇంత విషమిచ్చి చంపెయ్. పీడ వదిలిపోతది.... అప్పుడు నీవూ, మీయన్న -నీ వదిన...."చివరి మాట పెడర్థం వచ్చేటట్లు వత్తి పలికింది అనూరాధ.

"ఏయ్! నరుకుత!" వదినమ్మ గురించి అపశబ్దం దొర్లడం సహించలేకపోయాడు. "ఆమె దేవతే! ఆమె పేరెత్తే అర్హత నీకు లేదు" వేలు చూపిస్తూ హెచ్చరించాడు.

"అవునయ్యా...! ఆమె నీకు దేవతనే. మరి ఆ దేవత ఉండంగ, గీ దయ్యాన్నెందుకు గట్టుకున్నవ్...." అనూరాధ మాట పూర్తి కాలేదు.



చెంప పేలిపోయింది వెంటనే.

"ఖబడ్దార్ ఇంకొక్క మాట మాట్లాడినా నిజంగానే నిన్ను సంపిపారేస్త!" రక్తం మరిగిపోయింది.

దెబ్బతగలిన చెంపను పట్టుకొని, సూటిగా చూసింది ఆమె.

"ఓసి రాక్షసి! నీవేనే.... నీవేనే అన్నిటికీ కారణం. కైకలాగ ఈ ఇంట్ల అడుగుపెట్టినవ్. పచ్చటి సంసారంల చిచ్చుమొదలైంది....." జరిగినదంతా గుర్తొచ్చి పేగులు కదిలాయి. "నీ మాటలు నమ్మి దేవుడటువంటి మా యన్నను పదిమందిల అనరాని మాటలన్నా. తల్లివంటి మా వదినమ్మను గురించి హీనంగ మాట్లాడినా. నలుగురూ నా మొగమ్మీదనే ఉమ్మేసిన్రు. నీకు సంతోషమయ్యింది గద! ఇగ నీవు సుకంగ ఉండు..." అక్కడుండలేక బయటికి నడిచాడు....

ఉదయం జరిగిందంతా గుర్తుకురాగానే మరోవైపు తిరిగి పడుకున్నాడు అనంతరెడ్డి. ఆకలితో, ఆవేదనతో మండుతున్న కడుపుతోనే చేనుకెళ్ళాడు. పచ్చని పత్తిచేను ఎప్పటిలాగే

ఆత్మీయంగా పలకరించింది. "ఈ పంట మాత్రం నర్సిరెడ్డికే దక్కుతది. పంటలైపోయినాక పంపకాలు జేసుకోండి!" అంటూ పెద్దలు చెప్పిన తీర్పు గుర్తొచ్చింది. అన్న జూపించిన అప్పుల లిస్టును బట్టి పెద్దలా నిర్ణయం జేసిన్రు. అయినా ఆయన "వానికి కష్టమైతది. పంట మీద పదివేల రూపాయలు వానికిస్తా"నని చెప్పడం ఆయనకే చెల్లింది. నిజంగా ఆయన ధర్మరాజే. నేనే దుర్యోధనుని తీరు ఐపోయిన....

నిద్రపట్టక లేచి కూర్చున్నాడు.

'అసలిదంతా ఎందుకు జరిగింది? ఈ పరిస్థితికి కారణమేంది?' "ఈ జమానల గూడ రామలచ్మనుల్లోలె ఉన్నారయ్యా మీరు...." అంటూ ఊళ్ళోని వాళ్ళంతా చెప్పుకుంటూంటే - నేనే రాక్షసునిలాగ మారిపోయిన. శూర్పణఖలాగ అనూరాధ...." మళ్ళీ భార్యవైపు మళ్ళాయి అతని ఆలోచనలు.

పెళ్ళైన కొత్తలో చాలా బాగున్నది. అన్నా-వదినలను దేవతలన్నది. వాళ్ళ సేవ జేసుకోవడం పుణ్యమన్నది. వదినమ్మకు కష్టం గల్గరాదని పనులన్నీ పోటీపడి చేసేది. పిల్లలిద్దర్నీ తనే తల్లిలాగ జూసుకునేది.

అన్నయ్యకిద్దరూ ఆడపిల్లలే - సంగీత, సౌజన్య. తనకిద్దరూ మగపిల్లలు. కానీ, ఏనాడు తమకిద్దరు పిల్లలున్నారనిపించలేదు. తమకు నలుగురు పిల్లలు - అంతే. పెద్దకొడుకు రాకేశ్ రెడ్డి అన్నయ్యను కూడా 'నాన్నా!' అని పిలవడం ఈసంగతికి అద్దం పడుతున్నది. కాని, పొరబాటెక్కడ జరిగింది....?

బహుశా... బహుశా.... పిల్లలు పుట్టింతర్వాతనే అనూరాధలో ఈ మార్పు మొదలయ్యిందేమో....! అవును అదే నిజం! మొదటిసారి పురిటి కెళ్ళొచ్చిన తర్వాత చాలా రోజులు ముభావంగా ఉన్నది. కాని, రాకేశ్‌కు జబ్బు చేసినప్పుడు అన్నా వదినలు తల్లడిల్లిపోయి, వానికి నయమయ్యేదాక కంటికి కునుకు లేకుండా కష్టపడ్డారు. దాంతో అనూరాధ మళ్ళీ మామూలుగా అయిపోయింది. అయితే కుక్కతోక వంకర లాగ రెండో కాన్పయినాక మొత్తమే మారిపోయింది.....

వదినమ్మకు ఆరోగ్యం బాగాలేకుంటే పనంతా తననెత్తినే పడతదని లేని తలనొప్పి నటించి, మూడురోజులు మంచం వదలలేదు. పదేళ్ళు నిండని పసిపిల్లలు ఆపసోపాలు పడి పనులు జేసుకున్నారేగాని, ఎవ్వరూ ఏమీ అనలేదు. పెద్దమ్మాయి సౌజన్యకు బలంకోసమని పాలల్లో

బాదం పప్పు తాగించమని డాక్టరు చెబితే, వదినమ్మకు తెలియకుండా ఆ పప్పులోంచి మూడొంతులు దాచిపెట్టి, రాజేశ్‌కు బలవంతంగా తినిపించేందుకు ప్రయత్నించింది - వాడు వద్దంటున్నా పట్టించుకోకుండా. అప్పుడది తప్పని తనకనిపించినా అడ్డుకోలేకపోయాడు తను.

బ్యాంకులో ఆడపిల్లల పేరున అన్నయ్య డబ్బులు జమచేస్తున్నాడని తెలుసుకొని నానా గొడవ చేసింది. తను కూడా ఆ విషయంలో అన్నయ్యనే తప్పుబట్టాడు. 'అనంతీ! మీకు గావలసినవన్నీ నేనే గదరా చూసేది. కావాలంటే లెక్కలన్నీ నీవే చూసుకో....' అంటూ నచ్చజెప్ప జూసిన అన్నయ్యనసలు నమ్మనేలేదు. అది మొదలు అన్నకు తెలియకుండా అందినంత మేర దాచెయ్యడం మొదలుపెట్టాడు తనుగూడా. టౌనుకెళ్ళి ధాన్యమమ్మినప్పుడు, సరుకులు కొన్నప్పుడు, పెట్టుబళ్ళప్పుడు.... కాని, తను చేస్తున్నది సరికాదనిపించేది ఒక్కొక్కసారి - దోస్తులతో అంటే - 'మీయన్న మాత్రం తక్కువనా? శానామందికి అప్పులిచ్చాడు. ఆ లెక్కలన్నీ నీకు జెప్తున్నాడా?' అంటూ ఎగదోశారు. తనకు తెలిసే అనూరాధ వాళ్ళమ్మవాళ్ళకు యాభైవేలు ఇచ్చింది. తెలియకుండా ఇంకెన్ని చేరవేసిందో?! .... ఒక రకంగా ఇదంతా తన చాతగాని తనమేగాని, భార్యను అనడంలో అర్థంలేదు.... కాదు దీనికంతటికీ కారణం పైసలే. పైస ఎన్ని పాపిష్టి పనులన్నా చేయిస్తది.

ఉన్న పొలం ఐదెకరాలే. అయినా అన్నయ్య కష్టం, శ్రద్ధ వల్ల ఊళ్ళో అందరికంటే మంచి పంటలు తీయగల్గుతున్నాం. నలుగురికీ సాయం జెయ్యడమేగాని, ఎవ్వనికి చెయ్యి సాచి యెరుగం. రెండు బర్రెలు, ఒక పనోడు..... దేనికీ కష్టం గలుగలేదు. అన్నయ్య కలుగనీయలేదు.

"ఈ ఆస్తి అంతా పరాయోడెవ్వడు దింటడురా? ఆడపిల్లలు ఒక ఇంటికిస్తే పోయేటోళ్ళు. మేమిద్దరం అన్నదమ్ములం, మాకిద్దరు కొడుకులు." ఈ మాట అన్నయ్య నోటి నుండి ఎన్నోసార్లు విన్నాడు తను. కాని.

"ఆయనంటే ఒప్పుకుంటాడేమో, ఆయన పెండ్లాం-పిల్లలు ఒప్పుకోవద్దా? ఇప్పుడన్నీ కానూన్లు (చట్టాలు) మారినయ్. ఆడపిల్లకు గూడ ఆస్తిలో హక్కుంటది! ఆయన జెప్పే మాటలన్నీ మందిని పరేషాన్ జెయ్యనీకే...." అంటూ పడకటింట పెళ్ళాం జెప్పిన మాటలే పసందనిపించాయి మరి. అదే వైరానికి అసలు బీజాలు నాటిన సమయంగావచ్చు. దానికితోడు బిడ్డల పేరున అన్నయ్య పైసలు జమచెయ్యడం.....

అయినా ఆయన జేసేపనిలో తప్పేమున్నది? పిల్లల పెండ్లిళ్ళ కవసరమయితాయని కూడ బెడ్తున్నాడేమో! మా కులంలో మొలతాడున్నోనికెవ్వనికైనా లక్షలక్షలు కట్నంగావాలె. అన్ని

పైసలు ఒక్కసారే అమరుతాయా? ఇన్ని రోజులూ అన్నీ ఖర్చులేనాయె. ఇప్పుడైనా ఎంతో కొంత వెనకెయ్యకపోతే ఎట్లా? నిన్న పనిగట్టుకొని బ్యాంకుకెళ్ళి తెలుసుకుంటేగాని, ఆ పైసలు నేను వెనకేసినదానికంటే తక్కువే అన్న విషయం అర్థంగాలేదు.... గుండెల్లో పెట్టుకొని పెంచాడు అన్నయ్య.

నాయన చచ్చిపోయాక ఆయనే అన్నీ అయి చూసుకున్నాడు.

"అనంతీ! ఇద్దరమూ ఈ యెవసాయంల గొట్టుక చచ్చుడెందుకురా? నీవు మంచిగ జదువుకో!" అంటూ టవున్లో స్కూలుకు బంపిండు. కిరాయి ఇంట్లో ఉంచి, అన్నీ సమకూర్చిండు. తన రాత సరిగ్గాలేక పదోతరగతి మూడుసార్లు రాసి అందరి దృష్టిలో పల్చనైపోతి. తెలుగు దప్ప మిగతా సబ్జెక్టులు తలా తోకా దెలిసేవిగాదు. 'ఎద్దున్నోనికి బుద్ధిలే' దన్న సామెతకు ఒక నిదర్శనంగావాలని పాటు పడితి. అయినా అన్న పల్లెత్తుమాట అనలేదు. వదినమ్మగూడా అన్నకు తగినదే. ఆయన మీదెంత గౌరవమో తన మీదంత ప్రేమ జూపించేది.... వదినమ్మ గుర్తుకు రాగానే కళ్ళు చెమ్మగిల్లాయి.

తల్లిలాంటి వదినమ్మను గురించి ఎంత చండాలంగా మాట్లాడింది అనూరాధ? అందుకే తన నెత్తురు మరిగిపోయింది. అమ్మ చిన్నప్పుడే పోయింది. అక్క చెల్లెళ్ళు లేరు. అన్నీ తానే అయ్యి, అన్ని ప్రేమలూ పంచింది ఆతల్లి. పెళ్ళాం మోజులో పడి, ఆమెను కూడా తప్పుబడితి.... ఛీ.... ఎందుకీ బతుకు?

అన్నయ్య.... వదినమ్మ.... పిల్లలు.... ఎంత తల్లడిల్లిపోతున్నారో?!

"బాబాయ్! ఒక్కసారి ఇంటికిరా! అమ్మ ఒగటే ఏడుస్తున్నదీ!" అంటూ పిల్లలిద్దరూ వచ్చి బతిమాలితే - తన పేగులు కదిలిపోయాయి - కాని.....

"అంతా యాక్షన్! మేమెవ్వరమూ సిగ్గుదప్పి లేమిక్కడ. పదిమందిలో వేరయిపోయినాక అయిపోయింది వెళ్లండి. మళ్ళీ ఈ గడపదొక్కొద్దు...." అంటూ నానా మాటలంటున్న భార్యను అడ్డుకోలేకపోయాడు. పసివాళ్ళ కన్నీళ్ళకు గూడా కరగని రాయిలా మారాడు తను...

'కరెక్టే! దీనికంతటికీ కారణం అనూరాధే. ఆడదే దేనికైనా కారణం. మా కుటుంబం ఇలా ముక్కలు గావడానికి అదే కారణం. ఆ పనికి మాలిన దానికోసం నేనిట్లా ఆకలితో, బాధతో, కష్టంతో కొట్టుకోవడమెందుకు? దాన్ని తన్ని, మా సంసారం చక్కదిద్దుకుంటాను' ఆవేశంగా లేచాడు. కర్రందుకొని, తువాల భుజానేసుకుని బయలుదేరాడు.

0-0-0

"పుట్టుకతో అన్నదమ్ములు, పెరిగినాక దాయాదు'లని పెద్దలు జెప్పనే జెప్పిన్రు. ఎందుకు నర్సిరెడ్డీ పస్తాయించుడు? ఇది లోకంల ఉన్నదే. నీవు కొత్తగ అనుభవిస్తున్నదేమీ గాదు. మనసు సమాధానం జెసుకోవాలె....." ఆ సాయంత్రం నుండీ అదే పనిగా చెప్తూనే ఉన్నాడు - నర్సిరెడ్డి మామ చంద్రారెడ్డి.

మూడ్రోజులుగా భర్త అన్నం సరిగ్గా దినడం లేదని, ఎవ్వరు చెప్పినా వినడంలేదని తన తండ్రిని పిలిపించింది - నర్సిరెడ్డి భార్య అనసూయ. ఆయన మాటలమీద నర్సిరెడ్డికి గౌరవమున్న మాట నిజమే.

మామ ఏమన్నా నర్సిరెడ్డి మౌనమే సమాధానం. అన్నదమ్ములిద్దరూ సహజంగా మితభాషులు. అందులోనూ నర్సిరెడ్డిదే పైచేయి. నోట్లో నాలుకలేని వాళ్ళలా పేరుబడ్డ వాళ్ళిద్దరూ నలుగురి నోళ్ళలో నానడమే మింగుడు పడటం లేదతనికి.

"లే! లే! ఇప్పటికే రాతిరి శానా అయ్యింది. లేచి అన్నందిను...." తన మాటలు తప్పక ప్రభావం చూపుతాయన్న నమ్మకం చంద్రారెడ్డిది.

"నువ్వు గానీయ్ మామా! నేను మల్లొస్త..... !" ఏదో గుర్తుకొచ్చినట్టు చటుక్కున లేచాడు నర్సిరెడ్డి. తువ్వాల తలకు చుట్టుకొని, కర్రందుకుని, గబగబా బయటికి నడిచాడు.

"అయ్యో....! ఇయ్యాల్లప్పుడు ఎక్కడ వోతవయ్యా? నీ కోసం మా నాయన గూడ తినకుండా గూకున్నాడు....." అనసూయ మాటలు నర్సిరెడ్డికి వినిపించాయో, లేదో చెప్పటం కష్టం!

'తమ్ముడు చిన్నోడు. వానికేం దెలువది. అజ్ఞానంల ఏదేదో అన్నాడు సరే. తన తెలివేమైంది? లోకం దెలువనోడు వాడు. ఎవరో జెప్పిన మాటలు విని గట్ల తయారైనాడుగాని, వాని మనసు వెన్నముద్ద. ఏ కల్మషమూ దెలవనోడు. తనకు దెలువకుండా కొంత పైస జమజేసుకున్నట్లు దెలిసింది. చేసుకోనీ, అది వానికి ముందర పనికొచ్చేదే గద! నష్టమేమున్నది? ఇగ మరదలి సంగతా? ఆడపిల్లలెవరైనా గట్లే ఆలోచిస్తరుగావచ్చు. తన మొగుడు, తన పిల్లలు బాగుండాలనుకుంటారు. అందరూ తన భార్యలాగ పెద్ద మనసుజేసుకుంటారా?.... ఇవన్నీ తను ముందే ఆలోచించవలసింది. పాపం! వాళ్ళ మనసులు ముక్కలయ్యుంటయ్. తాను మాత్రం వాళ్ళు లేకుండా ఉండలేడు. వాళ్ళు దిట్టినాసరే, సముదాయించుకొని ఇంటికి....' నర్సిరెడ్డి ఆలోచనల్తో పాటే నడకా ఆగిపోయినయ్. ఎక్కడికెళ్ళాలని బయల్దేరి అక్కడికొచ్చాడో తెలియదు.

ఎదురుగా తమ్ముడు.

ఇద్దరూ పరస్పరం ఒకేసారి చూసుకున్నారు.

వెన్నెల వెలుగులో తమ్ముడి మొహం పరిశీలనగా చూశాడు నర్సిరెడ్డి. బాగా పీక్కుపోయినట్లు కళావిహీనంగా కనిపిస్తోంది.

కళ్ళెత్తి అన్నను చూశాడు అనంతరెడ్డి. ఎప్పుడూ అంత దీనంగా కనిపించలేదాయన మొహం. కనిపిస్తే, కన్నీళ్ళతో కాళ్ళుకడగాలని అప్పటి వరకూ అనుకున్నాడు. కానీ, ఏదో స్వాభిమానం అతడ్ని కదలనీయలేదు.

"అ..... నం.... తీ.....!" అక్షరాల్ని కూడగడుతున్నట్టు పిలిచాడు నర్సిరెడ్డి.

అదే ప్రేమ, అదే ఆప్యాయత, అదే తడి.

గబుక్కున అన్నను చుట్టేసుకొని చిన్నపిల్లాడిలా ఏడ్చాడు అనంత్‌రెడ్డి.

కన్నీళ్ళాగలేదు నర్సిరెడ్డికి. అసలే సున్నితం. అందులో తమ్ముని దుఃఖం - అతని నిగ్రహానికి సవాలుగా నిలిచాయి.

"ఇంటికి వోదాం పద!" గొంతు పెగల్చుకున్నాడు నర్సిరెడ్డి.

అంతులేని ఆనందంతో అనంతరెడ్డి మనసుగంతులేసింది. ❖

(2004 దీపావళి ప్రత్యేక సంచిక, జాగృతి వారపత్రిక)